క్లుప్తంగా

సీఎం చంద్రబాబును కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



గుంటూరు ఎడ్యుకేషన్: శిథిలావస్థకు చేరిన ఉమ్మడి గుంటూరు జెడ్పీ కార్యాలయ పరిపాలనా భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు కలిశారు. వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జెడ్పీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు. ఈ సందర్భంగా తనకు ప్రభుత్వం తరపున అధికారిక వాహనాన్ని కేటాయించాల్సిందిగా సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించినట్లు క్రిస్టినా తెలిపారు.

నృత్య పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ కర్ణాటక మ్యూజిక్ అండ్ డ్యాన్సర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటిన కాశీ విశ్వనాథ్ ఆలయంలో జరిగిన శివ తాండవ నృత్య పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని తుమ్మూరు జ్ఞానితి ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నృత్య పోటీల్లో పాల్గొన్న జ్ఞానితి పది ప్రపంచ రికార్డులను సాధించినట్లు వివరించారు. విద్యతో పాటు నృత్య శిక్షణకు తమ పాఠశాల ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అత్తోట సుబ్బారావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి



నగరంపాలెం: జిల్లాలోని వసతి గృహాలు, కేంద్రాలలో ఉండే పిల్లలకు మౌలిక సదుపాయాలను కల్పించడంలో తాత్సారం చేయవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రెండో విడతగా బుధవారం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం నిర్వర్తించే హోమ్స్‌ను ఆమె తనిఖీ చేశారు. మల్లికార్జునపేట మూడో వీధిలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రం, బృందావన్ గార్డెన్స్, బ్రాడీపేట 6/1వ అడ్డరోడ్డు, ఎస్‌వీఎన్‌కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాలను సందర్శించారు. అందులో ఉంటున్న పిల్లలతో మాట్లాడారు. వసతి గృహాల్లో సౌకర్యాలు.. పర్యవేక్షణ ఎలా ఉందని అడిగారు. అదే విధంగా నిర్వాహకులతో మాట్లాడారు. విద్యార్థులకు విధిగా మౌలిక సౌకర్యాలను అమలు చేయాలని చెప్పారు.

మహిళలకు చీరల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ జన్మదినం సందర్భంగా బుధవారం ఇజ్రాయిల్‌పేట ఒకటో లైనులోని చర్చి వద్ద గుంటూరు జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతగుండ్ల రాజాబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. అభిమానులు మహిళలకు చీరలు, పిల్లలకు, పెద్దలకు పండ్లు పంపిణీ చేశారు. రాజాబాబు మాట్లాడుతూ మనసున్న మంచి మనిషి, మానవతావాది ప్రభాస్ అన్నారు. కోవిడ్‌తో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో పెద్ద ఎత్తున ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వానికి అందించి, బాధితులకు బాసటగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు మల్లేపల్లి రమేష్, ఎస్‌కే మస్తాన్, నాగమల్లి, పి. ఇజ్రాయేలు, మాచవరపు బుజ్జి, వై.దాసు, వై. మహేష్, వై. శామ్యూల్ పాల్గొన్నారు.

ఇటు గుంతలు.. అటు ముళ్ల కంపలు



గుంతలతో అధ్వానంగా ఉన్న కసుకర్రు రోడ్డు



వంతెన వద్ద ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిన చెట్లు

అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పొన్నూరు: మండల కేంద్రం పొన్నూరు నుంచి కసుకర్రు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. ఓ వైపు రోడ్డుపై లోతైన గుంతలు, మరోవైపు ఇరువైపులా ముళ్లపొదలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడం కష్టంగా మారింది. గ్రామ సమీపంలోని వంతెన వద్ద ద్విచక్ర వాహనదారులకు ముళ్ల కంపలు గుచ్చుకుని గాయపడుతున్నారు. ఈ దారి వెంట సీతారాపురం, ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల ప్రజలు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. త్వరితగతిన ముళ్ల పొదలు తొలగించడంతో పాటు గుంతలను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గులాబీ రంగు పురుగుపై అప్రమత్తత అవసరం

జీజీపాలెం(కాకుమాను): పత్తి రైతులంతా గులాబీ రంగు పురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ బి.సుధారాణి సూచించారు. పెదనందిపాడు మండలంలోని జీజీపాలెం, అబ్బినేనిగుంటపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటపై గులాబీ రంగు పురుగు కనిపించిన వెంటనే నివారణకు పసుపు, నీలం రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రబీ సీజన్‌లో శనగ, మొక్కజొన్న సాగుకు సిద్ధపడుతున్న రైతులకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాక డాక్టర్ స్వాతి, వీఏఏలు పవన్ కుమార్,సుజాత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాకుమాను మండలంలో..

మండలంలోని బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ కిరణ్మయి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటపై దోమ ఆశిస్తుందన్నారు. నివారణకు ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ 200 లీటర్ల మందును నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



పురుగు గురించి రైతులకు వివరిస్తున్న ఏవో సుధారాణి

మలినేని కళాశాలలో హాకతాన్ ఎక్స్‌పో

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మేక్ స్కిల్ల్ కంపెనీ ఆధ్వర్యంలో 36 గంటల హాకతాన్ ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్వీఆర్‌జేసీ, ఎస్‌పీటీపీ ఫౌండేషన్ పీఓ డాక్టర్ మహేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా నేటి సాంకేతిక రంగంలో పోటీపరంగా కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని సూచించారు. మేక్‌స్కిల్ల్ పీఓ పి.మధు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యతలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని తెలిపారు. మలినేని సంస్థల అధినేత డాక్టర్ పెరుమాళ్లు మాట్లాడుతూ మహిళ ఇంజినీరింగ్ విభాగంలో మలినేని విద్యార్థులు ఇన్నోవేటివ్ ప్రాజెక్టులతో కళాశాలను అగ్రస్థానంలో నిలబెట్టాలని చెప్పారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎక్స్‌పో స్టాల్స్‌ను అతిథులు సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, డైరెక్టర్ శ్రీనివాసకుమార్, చార్లెస్ జయరావు, డాక్టర్ రవికిరణ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఎక్స్‌పోలో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులు అందజేశారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అతిథులు

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చిన్నపలకలూరులో ఇటీవల అనారోగ్యంతో కాలును కోల్పోయిన గ్రామ మాజీ సర్పంచ్ తోట నాగేశ్వరరావును బుధవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. దాసుపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పాటిబండ్ల లూర్ధుమేరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకర్త కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తోట నాగేశ్వరరావును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలి



పొన్నూరు: పట్టణంలోని డ్రెయిన్లలో పూడిక తీత పనులు నిరంతరం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదేశించారు. ఆయన బుధవారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్లో పేరుకు పోయిన చెత్త, వ్యర్థాల కారణంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొందని ప్రజారోగ్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించాలని ఆదేశించారు. కూరగాయల వ్యాపారులు వ్యర్థాలను ఒక బుట్టలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. వ్యాపారులు కార్మికులకు సహకరించాలని ఆయన కోరారు.


విద్యార్థులకు అపార్ నమోదుపై అవగాహన

పొన్నూరు: మండలంలోని ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ నమోదు తప్పనిసరిగా చేయాలని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ కమిషనర్ అపార్ ఐడీ నమోదు ఆవశ్యకతను మండల విద్యాశాఖాధికారులు , ప్రధానోపాధ్యాయులకు వివరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ నవంబరు 14న అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్యలు, అత్యాచారాలు అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

చేబ్రోలు: మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు అరికట్టడంలో టీడీపీ ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ విమర్శించారు. తెనాలికి చెందిన సహానాను చంపిన నవీన్‌ను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాత్రి స్థానిక కచేరి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడుల్ని అరికట్టడంలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం అవుతున్నాయని తెలిపారు. నిందితులు అధికార పార్టీ అండతో సులభంగా తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను శిక్షించడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న సాచివేత ధోరణి సరైంది కాదని ఖండించారు. మహిళలపై దాడులు జరుగుతున్నప్పుడు వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ మహిళలపై జరుగుతున్న దాడులను, అత్యాచారాలను అరికట్టడంలో లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు రాఘవమ్మ, మండల కార్యదర్శి హనుమంతరావు, శారద, దీపిక పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులతో మండల విద్యాశాఖాధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 34 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బుధవారం గుంటూరు కమాండింగ్ ఆఫీసర్ సుదర్శన్ ఏ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం. ఎం ఏడుకొండలు ఎంఈవోలు ఏహెచ్‌వీ ప్రసాద్, రాయల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి ఎన్‌సీసీ ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఉన్నత విద్యలో ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని, దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ టీచర్ దుర్గాబాయి, ఉపాధ్యాయుని ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

పొన్నూరు: దీపావళి పురస్కరించుకొని మండల, పట్టణ పరిధిలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తగిన జాగ్రత్తలు తప్పక పాటించడంతో పాటు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ జియా వుల్ హక్ అన్నారు. పట్టణంలోని సాక్షి భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న బాణసంచా విక్రయ దుకాణాల స్థలాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుతో కలసి తహసీల్దారు పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో బాణసంచా విక్రయ దుకాణదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాణసంచా అమ్మకాలకు దీపావళికి మూడు రోజులు ముందుగానే అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జీఎస్టీ, ఫైర్, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ చలానాలను చెల్లించి అనుమతులు పొందాలని సూచించారు. సమావేశంలో అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాదరావు, ఎంపీడీవో చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియా

పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

పెదకాకాని: ఇంజనీర్లు పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి సారించి భారతదేశాన్ని ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాలని గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్ఫర్మేషన్ (జి.ఎఫ్.ఎస్.టి) వైస్ చైర్మన్ డాక్టర్ రామ్‌నాథ్ వెలమాటి సూచించారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన విజన్–2047 సదస్సుకు ముఖ్యవక్తగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో యువతకు అవకాశాలు అరుదుగా ఉన్నాయని, వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు జ్ఞానాన్ని పరిమితం చేసుకోకుండా అధునిక నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. రాబోవు మూడు సంవత్సరాలలో భారత్ మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందన్న ఆశాభావం వ్యక్తపరిచారు. విద్యార్థులు నిత్యం నూతన అంశాలను తెలుసుకుంటూ ఉండాలనీ, కష్టపడాలని సూచించారు. అనంతరం డాక్టర్ రామ్‌నాథ్ వెలమాటి, శాఖమూరు శ్రీనివాస్ ప్రసాద్‌ను కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, సెక్రటరీ సూర్యదేవర బదరీ ప్రసాద్ సత్కరించారు.



రామ్‌నాథ్‌ను సత్కరిస్తున్న విద్యాసాగర్, బదరీ ప్రసాద్

ఆన్‌లైన్‌లో మాయ వ్యాపారం

- బహుమతుల పేరిట బురిడీ
- కొత్త మోసాలతో డబ్బు వసూలు
- ఆందోళనలో బాధితులు

లక్ష్మీపురం: ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లలో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు వీక్షకుల్ని బుట్టలో పడేస్తాయి. ఏదైనా ఒక వస్తువును బుక్ చేసుకుంటే నిమిషాల వ్యవధిలో నగదు లేదా కలర్ టీవీ, యాపిల్ ఫోన్, ద్విచక్ర వాహనం వంటి వాటిని డ్రాలో బహుమతిగా పొందవచ్చంటూ ఊదరగొట్టేస్తారు. ఆన్‌లైన్ పెట్టుబడుల పెట్టడం వల్ల కోట్ల రూపాయాలను ఇంటి వద్దనే ఉండి సంపాదించవచ్చు అంటూ వచ్చే ప్రకటనలకు ఆశపడి ఎందరో అమాయకులు అడ్డంగా బుక్కవుతున్నారు. ఈ తరహా బాధితుల్లో గుంటూరు చెందిన ఓ మహిళ రూ. కోటికి పైగా మోస పోగా, మరో మహిళ వేలల్లో నష్ట పోయింది. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. మరి కొందరు దిక్కుతోచని స్థితిలో ఉండి పోతున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ అంటూ మోసం

గుంటూరు పశ్చిమ పరిధిలోని నలందా నగర్ ప్రాంతానికి చెందిన ఓ గృహిణి ఈ ఏడాది ఏప్రియల్ 24న ఇంటి పనులు పూర్తి చేసుకుని రోజు మాదిరిగానే ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ద్వారా రీల్స్, ఫేస్‌బుక్, వాట్సప్ పరిశీలిస్తున్నారు. అదే సమయంలో ఫేస్‌బుక్‌లో నుంచి మౌంట్.కమ్ అనే యాప్ ద్వారా ఒక మెసేజ్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయడం ద్వారా ఇంటి వద్దే రూ. లక్షలు సంపాదించుకోవచ్చని ఉండటంతో దాన్ని ఆమె క్లిక్ చేసింది. యాప్ ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టడం వల్ల అధిక లాభాలను ఆర్జించవచ్చని మరలా మెసేజ్ వచ్చింది. దీంతో ముందుగా ఆ గృహిణి కొంత నగదును ట్రేడింగ్ ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసింది. దానికి జోడించి కొంత నగదు లాభంగా వచ్చింది. దీన్ని మరలా ట్రేడింగ్‌లో మరి కొంత నగదు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసింది. మరలా కొంత లాభం నగదు ఆమె ఖాతాలోకి వచ్చింది. దీంతో ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్‌లో నగదు ట్రాన్స్‌ఫర్ చేయడం ప్రారంభించింది. ఇలా కొన్ని యాప్ ద్వారా లావాదేవీలు జరిగాయి. ట్రేడింగ్ యాప్ ద్వారా ఇక నుంచి డైరెక్ట్‌గా బ్యాంక్ ఖాతా, క్రెడిట్ కార్డు ద్వారా అయితే మంచి లాభాలు ఆర్జించవచ్చని మెసేజ్ వచ్చింది. దీంతో ఆ గృహిణి ఆన్‌లైన్ ట్రేడింగ్ మాటలు నమ్మి హెచ్‌డిఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా నగదు కొంత ట్రాన్స్‌ఫర్ చేసింది. దీంతో ఆ గృహిణి హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాలో రూ.1,27,06712 కోట్లు నగదు మాయం అయింది. దీంతో ఆ గృహిణి యాప్‌కు సమాచారం తెలియజేసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. ఆ యాప్, ఆన్‌లైన్ ట్రేడింగ్ పూర్తి మాయం అయిపోయింది. దీంతో దిక్కుతోచక ఆ గృహిణి సెప్టెంబర్ 25న పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆన్‌లైన్ షాపింగ్ యాప్ (ఫైల్)

లక్కీ డ్రా అంటూ ఆశలు

నగరంలోని అమరావతి రోడ్డు ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏడాది క్రితం ఆన్‌లైన్ షాపింగ్ చేయడం వల్ల రెండు నిమిషాల్లో ద్విచ క్రవాహనం లేదా ఏదైనా ఆకర్షణీయమైన బహుమతిని లక్కీ డ్రా ద్వారా అందిస్తామని చెప్పడంతో నమ్మి కొనుగోలు చేసింది. మిక్సీ వారం రోజుల్లో ఆమెకు చేరింది. ఏడాది పూర్తియ్యాక ఇటీవల ఆమెకు పోస్టల్ ద్వారా వీపీపీ లెటర్ పేరుతో ఓ కవర్ వచ్చింది. ఆ సమయంలో పోస్ట్‌మాన్ కవర్‌లో ఏమి లేదని చెప్పి వెనక్కి తీసుకెళ్లాడు. తర్వాత బాధితురాలుకు ఓ ఎగ్జిక్యూటివ్ ఫోన్ చేసి "మీరు గత ఏడాది ఓ మిక్సీని కొనుగోలు చేసినందుకు కంపెనీ రూ.25 లక్షల చెక్కును పంపించింది. దాన్ని తీసుకోవాలంటే రూ.25 వేలు చెల్లించి తీసుకోవా"లని చెప్పాడు. వెనక్కు పంపిన కవర్‌ను మరలా ఆమె వద్దకు వచ్చింది. రూ.25 లక్షల చెక్కు తమకు బహుమతిగా వచ్చిందని నమ్మిన బాధితురాలు ఎంతో ఆశతో రూ.25వేలను మెడలో ఉన్న బంగారు గొలుసును తాకట్టు పెట్టి మరి చెల్లించి తీసుకుంది. కవర్‌ను తీసి చూస్తే లోపల ఓ తెల్లకాగితం పై ఓ మొబైల్ నంబర్‌తో ప్లీజ్ కాల్‌మీ ! అని రాసి ఉంది. లోపల చెక్కు ఉన్నట్టుగా బయట నుంచి తెలియడం కోసం కవర్ లోపలి బ్యాగులో తమిళ పేపర్ పెట్టి ఉంది. దాన్ని చూసి బాధితురాలు అవాక్కైంది. మళ్లీ ఆ కవర్‌లో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేసింది. "మీకు కవర్‌ను ముందుగా సరైన చిరునామాకు పంపిచమామా లేదా అని ముందుగా ఓ ట్రెల్ వేశాం.. మీకు రెండు రోజుల తరువాత రూ.25 లక్షల చెక్కు వస్తుంది " అని ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి నమ్మబలికాడు. ఆ కవర్ వచ్చి కూడా ఆరు నెలలు అవుతున్నా ఇంత వరకు అతీగతి లేదు. ఆ ఫోన్ నంబర్ కూడా పని చేయడం లేదంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.



ఆన్‌లైన్ ట్రేడింగ్ మౌంట్ యాప్

ఒక్క గుంటూరులోనే కాదు చాలా ప్రాంతాల్లో పలువరు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసి మోసపోతున్నారు. కొన్ని చోట్ల ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ బాధితులు వాపోతున్నారు. తపాల శాఖ కూడా ఇలాంటి బిజినెస్ పార్శిళ్లు పంపే సమయంలో దానికి సంబంధించిన సమగ్రమైన వివరాలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. అమరావతి రోడ్డులోని గోరంట్లలో గల కళాశాలలో బుధవారం ఈఏ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు 77 మంది పాల్గొనగా, వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 27 మంది ఎంపికయ్యారు.ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ జె. ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు, ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమదివ్య, హెచ్‌ఆర్ జాన్ డేవిడ్, అభినందించారు.

జోరందుకున్న రైల్వే గుర్తింపు ఎన్నికల ప్రచారం

లక్ష్మీపురం: రైల్వే గుర్తింపు ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ సెక్రటరీగా పోటీ చేస్తున్న సీహెచ్. శంకరరావు బుధవారం గుంటూరు రైల్వే స్టేషన్, నంబూర్ స్టేషన్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆయనకు గుంటూరు డివిజన్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి, నిజాయతీలతో పని చేసే మజ్దూర్ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికుల డిమాండ్స్ సాధించడంలో ముందుండి పోరాడుతామని తెలిపారు. రాబోయే ఎన్నికలలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌ను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. మజ్దూర్ యూనియన్‌కు ఎలాంటి రాజకీయ పార్టీల అండదండలు లేవని, కార్మికుల నుంచి పుట్టిందని గుర్తు చేశారు. అనంతరం స్థానిక గుంటూరు పట్టాభిపురంలో ఉన్న గుంటూరు రైల్వే డివిజనల్ డీఆర్‌ఎం రామకృష్ణను శంకరరావు, యూనియన్ నాయకులు కలిశారు. గుంటూరు రైల్వే డివిజనల్ మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ కోటేశ్వరరావు, డివిజన్ సెక్రటరీ ఎం.వి ప్రసాద్, డివిజన్ ప్రెసిడెంట్ మంజునాథ్, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలు కరుణశ్రీ, లావణ్య, జోనల్ వర్కింగ్ కమిటి సభ్యులు కె.వి.ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.